బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 02 మార్చి 2025 | www.balagamtv.com | పేజీలు 4

# కనిపించిన నెలవంక



## నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రంజాన్ మాసం నెలవంక శనివారం దర్శనం ఇవ్వడంతో ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం కానున్నాయి. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లిం సోదరులు, సోదరీమణులు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఉపవాస దీక్షలో భాగంగా అల్లా నామ స్మరణ చేస్తూ తనకు తాను అంతర్గతంగా ఆత్మ ప్రక్షాళన చేసుకుంటారు. సూర్యోదయం కంటే ముందే నిర్దేశిత సమయంలో అన్నపానీయాలు తీసుకుంటారు. దీనినే సహర్ అంటారు. ప్రతి రోజూ కొన్ని నిమిషాల తేడాతో సూర్యాస్తమయంలో ఉపవాసదీక్ష విరమించడమే ఇఫ్తార్. ఇఫ్తార్‌ను ఖర్జూరా, ఇతరత్రా ఫలాలతో విరమిస్తారు.

# ఖనిజ అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం



- పెద్ద సంస్థలకు టీజీఎండీసీ నుంచి ఇసుక సరఫరా చేసేలా చర్యలు
- నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు
- పెండింగ్ ఖనిజాల మైనర్ బ్లాక్‌ల వేలానికి టెండర్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇసుకతో పాటు ఇతర ఖనిజాల అక్రమ తవ్వకాలు, అక్రమ సరఫరాపై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కఠిన చర్యలతోనే అక్రమాలను అడ్డుకోగలమని, ప్రభుత్వానికి ఆదాయం పెంచగలమని చెప్పారు.గనుల శాఖపై ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెల రోజులుగా తీసుకున్న చర్యలతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడిన విధానాన్ని, పెరిగిన ఆదాయాన్ని అధికారులు సీఎం గారికి వివరించారు. ఈ సందర్భంగా ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, రవాణా, వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరాపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు.

ప్రభుత్వంలోని నీటి పారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు, పెద్ద పెద్ద నిర్మాణాలు చేపట్టే సంస్థలకు అవసరమైన ఇసుకను తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ నుంచే సరఫరా చేసేలా చూడాలన్నారు.సరైన ధరలకు ప్రభుత్వమే ఇసుక సరఫరా చేస్తే వినియోగదారులు అక్రమంగా సరఫరా చేసే వారిపై ఆధారపడరని అన్నారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప ప్రాంతాల్లోనే ఇసుక ఎక్కువగా వినియోగం జరుగుతోందన్నారు. తక్కువ మొత్తంలో ఇసుక అవసరమైన వారు కొనుగోలు చేసేలా నగరానికి మూడు వైపులా ఇసుక స్టాక్ పాయింట్లు సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. గనుల శాఖ పరిధిలోని వివిధ ఖనిజాల క్వారీలకు గతంలో విధించిన జరిమానాలు, వాటి వసూళ్లపైనా సీఎం అధికారులను ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన విధానపరమైన నిర్ణయం త్వరగా తీసుకొని సమస్యను పరిష్కరించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నఖనిజాల మైనర్ బ్లాక్‌ల వేలానికి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, టీజీఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనీల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మట్టిదిబ్బ కింద నలుగురి ఆనవాళ్లు

- టన్నెల్ బోరింగ్ మిషన్ కింద మరో నలుగురు!
- ఆదివారం నలుగురి వెలికితీత
  సోమవారం వరకు మరో నలుగురు..?
- 300 మందికిపైగా సహాయక చర్యలు
- టన్నెల్ బయట అంబులెన్స్‌లు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మనుషులు ఉన్నట్లు ఆనవాళ్లు కన్పించిన ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్నట్లు మంత్రి జూపల్లి వివరించారు.ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో 5-8 మీటర్ల మట్టిదిబ్బ కింద నలుగురి ఆనవాళ్లు ఉన్నట్టు స్కానింగ్‌లో కన్పించాయని, మరో నలుగురు టీబీఎం మిషన్ సమీపంలో ఉండే అవకాశం ఉందని మంత్రి జూపల్లి అన్నారు. టన్నెల్ వద్ద సహాయక చర్యలను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మిషన్‌ను కట్ చేసి తునకలు బయటకు పంపుతున్నామని తెలిపారు. ఇది పూర్తయితే మిగతా నలుగురి ఆచూకీ లభించే అవకాశాలున్నాయన్నారు. సోమవారం వరకు మిగతా వారిని తీసుకురావడం జరుగు తుందన్నారు. లేకపోతే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. పేరుకుపోయిన మట్టిని తవ్వి బయటకు పంపుతున్నామని, లోపల ఎంత ప్రమాదకరంగా ఉంటుందో అక్కడికి వెళ్తే తెలుస్తుందన్నారు. కాళేశ్వరంలో 200 కిలోమీటర్ల సొరంగం తవ్వామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అంటున్నారు.. మరి పదేండ్లలో ఎస్ఎల్‌బీసీలో 20 కిలోమీటర్ల టన్నెల్ ఎందుకు తవ్వలేదని ప్రశ్నించారు. గత పదేండ్లలోనే దీన్ని పూర్తి చేసి ఉంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదేమో అని అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్మిక కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిందిపోయి ప్రతిపక్షాలు మరింత దిగజారుడుగా మాట్లాడటం భావ్యం కాదన్నారు. కార్మికులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పడం సరికాదన్నారు. సహాయక చర్యల్లో మొత్తం 12 విభాగాలు పనిచేస్తున్నారని మంత్రి వివరించారు. పనులు వేగంగా జరగటం లేదని కొందరు విమర్శిస్తున్నారని, లోపల పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో వారికి తెలియట్లేదని మండిపడ్డారు.

గత శనివారం ఉదయం 8.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ఎనిమిది మంది సొరంగంలో చిక్కుకున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, సౌత్‌సంటర్ రైల్వే, ఆర్మీ, హైడ్రా, ర్యాట్ మైనర్స్, ఎల్అండ్‌టీ, నవయుగ, అమెరికా రాబిన్ కంపెనీల బృందాలు షిఫ్టులలో సుమారు 300 మందికిపైగా తీవ్రంగా శ్రమించి ఆపరేషన్ చేపట్టారు. 14 కిలోమీటర్ల సొరంగంలో రెస్క్యూ టీంలు 13.50 కిలోమీటర్ల వరకు పోయాయి. ఆ తర్వాత నల్లమల గుట్టల నుంచి వచ్చే నీరు, మట్టి పేరుకుపోవడంతో మరో అర కిలోమీటరు ముందుకు పోవడం కష్టంగా మారింది. అక్కడే 9.2 మీటర్ల వెడల్పు ఉన్న టన్నెల్‌లో ఐదున్నర అడుగుల ఎత్తులో బురద, మట్టి పేరుకున్నది. టీబీఎం మిషన్‌తో గ్యాస్ కట్టర్లతో తునకలు చేసి పైపులతోపాటు ఇతర సామగ్రిని బయటకు పంపారు. అయితే శుక్ర, శనివారం సాయంత్రానికి జీపీఆర్ మిషన్ పరికరంతో స్కానింగ్ చేయగా.. ఘటనా స్థలంలో ఎన్‌జీఆర్ఐ నిపుణులు డీ కోడ్ చేశారు. రేడియో తరంగాల ద్వారా భూగర్భంలోని వస్తువుల అవశేషాలను ఇది గుర్తించింది. టీబీఎంతోపాటు ఇతర ప్రదేశాల్లో మనిషి ఆనవాళ్లు కనిపించినట్టు సహాయక బృందాలు తెలిపాయి.


సొరంగం చివర మిషన్ ఉన్న ప్రాంతంలో నీరు ఉబికి వస్తోంది. దీంతో సహాయక చర్యలకు ఆటంకంగా మారింది. అయినా సిబ్బంది శ్రమటోడ్చి బురదను తీస్తూ.. నీటిని బయటకు పంపిస్తూ కార్మికులను బయటకు తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. అయితే, 14 కిలోమీటర్ల సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకోవడమే సాహసం అని చెప్పొచ్చు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించడం పట్ల ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. అయితే, గల్లంతైన వారిలో గుర్తించిన నలుగురిని ఆదివారం బయటకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. మరో నలుగురిని ఆదివారం రాత్రి లేదా సోమవారానికి బయటకు తీసుకొస్తామని అంటున్నారు. అందరూ చనిపోయి ఉంటారని అంటున్నారు. టన్నెల్ బయట కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని బయటకు తీస్తే ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్‌లు, వైద్యుల్ని అందుబాటులో ఉంచారు.

# మంచు చరియలు విరిగిపడిన నలుగురు మృతి

- 50 మందిని కాపాడిన రెస్క్యూ సిబ్బంది
- లభించని ఐదుగురి ఆచూకి

వివరాలు 2వ పేజీలో

# యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ వెబ్‌సైట్ ప్రారంభం




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ పోలీసు కుటుంబాల పిల్లల కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు సంబంధించి వెబ్‌సైట్ https://yipschool.in ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటలో పోలీస్ స్కూల్ వెబ్‌సైట్‌తో పాటు సమగ్ర సమాచారంతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లలకు స్కూల్ యూనిఫామ్‌తో పాటు ఇతర అంశాలను ముఖ్యమంత్రి గారు పరిశీలించారు. సైనిక్ స్కూల్ తరహాలో పోలీస్ స్కూల్‌ను కూడా దేశానికి ఒక రోల్ మాడల్‌గా ఉండేలా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. విద్యా విధానంలో కొత్త ఒరవడిని అవలంభించాలని, క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అడ్మిషన్లలో పోలీసు అమరుల కుటుంబాల పిల్లలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ , అదనపు డీజీపీ (ఆపరేషన్స్) స్టీఫెన్ రవీంద్రతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీసు కుటుంబాల పిల్లల కోసం అంతర్జాతీయ స్థాయి స్కూల్ నిర్మాణం కోసం గత ఏడాది అక్టోబర్ 21 న ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు.

# వ్యవసాయ బడ్జెట్‌ను సత్వరం అమలు చేయాలి

- ప్రధాని నరేంద్ర మోడీ



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలను శీఘ్రగతిన అమలు జరపాలని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం పిలుపు ఇచ్చారు. కొత్త బడ్జెట్‌పై చర్చించే బదులు 'కార్యాచరణ'పై దృష్టి కేంద్రీకరించాలని సంబంధిత వ్యక్తులు, సంస్థలకు మోడీ విజ్ఞప్తి చేశారు. 'వ్యవసాయం, గ్రామీణ సంపద'పై బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధాని ప్రసంగిస్తూ, తన మూడవ విడతలో నిరంతర విధానపరమైన దృక్పథంతో 'వికసిత్ భారత్' కోసం ప్రభుత్వ కొత్త లక్ష్యం విస్తరణను బడ్జెట్ ప్రతిబింబిస్తోందని నొక్కిచెప్పారు. 'ఈ ఏడాది బడ్జెట్‌ను శీఘ్రగతిని అమలు పరచడం ప్రధానం. బడ్జెట్ రూపొందింది, మా మొత్తం దృష్టి కార్యాచరణపైనే' అని మోడీ తెలిపారు. బడ్జెట్ అమలులో 'ప్రతిబంధకాలను, లోటుపాట్లను' సంబంధిత వ్యక్తులు, సంస్థలు గుర్తించాలని ఆయన సూచించారు. బడ్జెట్‌కు ముందు సంబంధిత వ్యక్తులు, సంస్థల నుంచి సమీకరించిన వివరాలు, సూచనలు దాని రూపకల్పనలో తోడ్పడ్డాయని మోడీ తెలిపారు. 'ఇప్పుడు ఈ బడ్జెట్‌ను మరింత సమర్థంగా అమలు చేయవలసిన అగత్యం ఉంది.

వ్యవసాయాన్ని వృద్ధికి తొలి ఇంజన్‌గా పరిగణిస్తున్నారని, వ్యవసాయ వృద్ధి, గ్రామీణ సౌభాగ్యం సాధించాలనే జంట లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. ప్రభుత్వం 'వికసిత్ భారత్' లక్ష్యం సాధించేందుకు నిబద్ధమై ఉందని, ఏ రైతూ వెనుకబడి ఉండకుండా , ప్రతి రైతూ పురోగమించేలా చూసేందుకు కృషి చేస్తున్నామని మోడీ చెప్పారు. 'మనం దేశ వ్యవసాయ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకుని మరిన్ని లక్ష్యాలు సాధించవలసిన అవసరం ఉంది' అని ఉద్బోధించారు. ఆహారధాన్యాల ఉత్పత్తి ఒక దశాబ్దం క్రితనాటి 265 మిలియన్ టన్నుల నుంచి ప్రస్తుతం 330 మిలియన్ టన్నులకు పెరిగిందని, అదేవిధంగా ఉద్యాన పంటల ఉత్పత్తి 350 మిలియన్ టన్నులు దాటిందని తెలియ జేశారు. ప్రత్యేకంగా పిఎం ధన్ ధాన్య కృషి యోజన గురించి ప్రస్తావించారు. అది తనకు 'ఎంతో ముఖ్యమైన పథకం' అని అభివర్ణించారు. ఆ పథకం తక్కువ పంట ఉత్పత్తులు ఉన్న 100 జిల్లాలపై దృష్టి కేంద్రీకరిస్తుందని తెలిపారు. 2014, 2024 మధ్య 2900 పైచిలుకు కొత్త ఆహారధాన్యాలు, పప్పుధాన్యాలు, చెరకు, తదితర పంటల వంగడాలను ఆధునిక సాధనాలను ఉపయోగించి అభివృద్ధి చేసినట్లు మోడీ తెలియజేశారు. ఆ కొత్త వంగడాలు రైతులకు సరస మైన ధరలకు అందు బాటులో ఉండేలా చూడవలసి ఉంటుందని చెప్పారు. ఆరు సంవత్సరాల క్రితం ప్రారంభించినప్పటి నుంచి పిఎంకిసాన్ పథకం కింద 11 కోట్ల మంది రైతులకు సుమారు రూ. 3.75 లక్షల కోట్లను నేరుగా బదలీ చేసినట్లు ప్రధాని వెల్లడించారు.

# రంజాన్ మాసాన్ని సంతోషంగా జరుపుకోవాలి

- సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణు లందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఆచరించే కఠోర ఉపవాసం, దైవ ప్రార్థనలు ఆధ్మాత్మికతను, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలని, అల్లా దీవెనలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ జన జీవనం దర్పణం : కేసీఆర్



పవిత్ర రంజాన్ మాసంసందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణు లందరికీ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించే కఠోర ఉపవాసం, దైవ ప్రార్థనలు ఆధ్యాత్మికతను, జీవిత పరమార్థాన్ని ఎరుకపరిచి, క్రమశిక్షణను పెంపొదిస్తామని అన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ జన జీవనం దర్పణంగా నిలుస్తుందని కేసీఆర్ అన్నారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పలు కార్యక్రమాల ద్వారా, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిం దని గుర్తు చేశారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణకు మనం దేశానికే ఆదర్శంగా నిలిచామని, అదే వారసత్వాన్ని కొనసాగించాలన్నారు.

# కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న సస్పెండ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఎమ్మెల్సీ చింతపండు నవన్ (తీన్మార్ మల్లన్న)ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఇటీవల బీసీ సభలో ఓ వర్గంపై మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలాకు పాల్పడుతున్నట్లు హైకమాండ్ గుర్తించింది. ఆ వ్యాఖ్యలపై ఫిబ్రవరి 12 లోపు వివరణ ఇవ్వాలని ఫిబ్రవరి 5న షోకాజ్ నోటీసులు ఇచ్చింది. ఈ క్రమంలో మల్లన్న స్పందించకపోవడంతో పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు తాజాగా ప్రకటించింది.

# కేసీఆర్ సీఎం అయితేనే అగ్రస్థానానికి తెలంగాణ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**బలగం టీవీ, హైదరాబాద్**


తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డితో సహా పలువరు సర్పంచ్ లు, 500 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. "నిన్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ భవన్‌లో కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఢిల్లీ నుంచి వచ్చిన కొత్త ఇంచార్జ్‌కి స్వాగతం పలుకుతూ సమావేశం పెట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఆణిముత్యాల్లాంటి మాటలు చెప్పాడు. 'మంచి మైకుల్లో చెప్పాలి, చెడు చెవుల్లో చెప్పాలి' అని చెప్పాడు. మంచి మైకుల్లో చెప్పుదామని అనుకుంటే, నువ్వు చేసిన మంచి పని ఏదీ లేదు. మైకుల్లో మంచి చెబుదామని అనుకునే సరికి కరెంట్ కట్ అయిపోయింది. చెడు చెవుల్లో చెప్పాలని మొదలు పెడితే, హైద్రాబాద్ నుంచి ప్రారంభించి ఆర్ఆర్ ట్యాక్స్, ఎస్ఎల్‌బీసీ టన్నెల్, పెద్దవాగు, మునిగిన వట్టెం పంప్ హౌజ్ గురించి చెబితే నీ చెవిలో రక్తం కారిపోతుంది రేవంత్ రెడ్డి... యాదిలో పెట్టుకో! రేవంత్ రెడ్డి చాలా తెలివిగా చెప్పానని డైలాగులు కొడుతున్నాడు," అని కేటీఆర్ విమర్శించారు.

ఇక కొత్త ఇంచార్జి మీనాక్షి మాట్లాడుతూ.. "రైల్వేస్టేషన్‌లో దిగగానే బ్యాగులు మోసేందుకు కొంతమంది కాంగ్రెస్ నేతలు ఉరికొచ్చారు. బ్యాగులు మోసి మీ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీయొద్దని చెప్పారు." కానీ మీ పక్కన కూర్చొన్న వ్యక్తి చంద్రబాబు బ్యాగులు మోసి, ఇప్పుడు ఢిల్లీకి బ్యాగులు మోస్తున్నాడు. ఆయన్ని పక్కన పెట్టుకుని బ్యాగులు మోయొద్దంటే ఆ మేడంకు ఏం చెప్పాలి. మీనాక్షి వాస్తవాలు తెలుసుకోవాలని కోరుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాటలు, కథలు చెప్పొద్దు. ఆయన చేసిన మంచి చెప్పుకుంటే వడిసిపోదట. ఈ పదిహేను నెలల కాలంలో ప్రజలందరూ వాట్సాప్‌లు, యూట్యూబ్‌లు చూస్తున్నారు. ఏ ఒక్క ఆడబిడ్డను పలుకరించినా, రేవంత్‌ను ఏకిపారేస్తున్నారు. తెలుగు భాషలో ఇన్ని తిట్లు ఉంటాయని ఇప్పుడిప్పుడే తెలుస్తుంది. ఏం తిట్లు అవి.. రోషం ఉన్నోడు అయితే పాడుబడ్డ బావిలో దూకి చస్తుండే. కానీ రేవంత్ రెడ్డి కాబట్టి బ్రహ్మాండంగా బతికేస్తుండు. ఇంకా మంచి చేసిన అని డైలాగులు కొడుతుండు అని కేటీఆర్ మండిపడ్డారు.

కేసీఆర్ అప్పు చేసి సంపద సృష్టించి దేశప్రజ లకు పంచితే రేవంత్ అప్పు చేసి అరిష్టానం జేబులు నింపుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డిని తిట్టని వ్యక్తి' లేరని అన్నారు. అన్ని వర్గాలు తీవ్ర అసంతృప్తితో రలిగిపోతున్నాయన్నా రు. కేసీఆర్ హయాంలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో విధ్వంసం, అరాచకాలతో కుప్ప కూలింద న్నారు. హైడ్రా. మూసీ కూల్చివేతలతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. మేడ్చల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. కేసీఆర్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన 10 శాతం పనులు చేస్తే దేవెళ్లకు నీళ్లు వస్తాయన్నారు. కానీ రేవంత్ రెడ్డి అలా చేయకుండా ఎక్కడ. కేసీఆర్కు పేరు వస్తుందన్న అసూయతో ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే మూసీ సుందరీకరణ కోసం రూ.1.50,000 కోట్లు ఖర్చు చేసి కమిషన్లు రండుకొని, కాంగ్రెస్ అధిష్టానానికి సంపి తన పదవి కాపాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పంచాయతీలో ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయాన్ని సాధిస్తుందన్నారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని. కెరేజర్ ధీమా పుక్షణ చేశారు.

# వరంగల్ విమానాశ్రయం కొచ్చి తరహాలో ఉండాలి

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- విమానాశ్రయ నిర్మాణంపై అధికారులతో సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్**

వరంగల్ మామునూరు విమానాశ్రయం కేరళ కొచ్చి విమానాశ్రయం తరహాలో ఉండాలని, ప్రతి నిత్యం రాకపోకలతో విమానాశ్రయంలో కార్యకలాపాలు జరిగేలా డిజైన్ రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వరంగల్ నగరానికి విమానాశ్రయం ఎక అసెట్ గా ప్రతిష్టాత్మకంగా నిర్మాణం ఉండాలని చెప్పారు. వరంగల్ మామునూరు విమానాశ్రయానికి సంబంధించిన పనులన్నీ వేగంగా జరగాలని అధికారులను ఆదేశించారు. విమానాశ్రయ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

విమానాశ్రయానికి సంబంధించి భూసేకరణ, పెండింగ్ అంశాల వివరాలను ముఖ్యమంత్రి గారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైన తొందరగా భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేసి డిజైనింగ్ కు పంపించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ ప్రతి నెల తనకు ప్రగతి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.మామునూరు విమానాశ్రయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా కృషి చేసిన ముఖ్యమంత్రి గారికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు మరోసారి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు, కొండా సురేఖ గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ఎంపీలు కావ్య గారు, చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి గారు, రేవూరి ప్రకాష్ రెడ్డి గారు, నాగరాజు గారు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి గారు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్స్ పనుల పురోగతిపై సమీక్ష**

రాష్ట్రంలోని ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్స్ ను అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్లు గా తీర్చిదిద్దుతున్న పనుల పురోగతిపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆరా తీశారు. టాటా టెక్నాలజీస్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడేషన్ పనులపై ముఖ్యమంత్రి గారు కార్మిక శాఖ ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో సమీక్షించారు.ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న ఏటీసీలు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో తప్పనిసరిగా ఒకటి ఉండేలా చూడాల్సిందేనని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేయాలని చేయాలని, ఐటీఐలు లేని కేంద్రాల్లో కొత్తగా ఏటీసీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. నియోజకవర్గ కేంద్రాల్లో లేదా పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఏటీసీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏటీసీల్లో అవసరమైన సిబ్బంది ఇతర వివరాలను అధికారులు వివరించగా, సిబ్బంది నియామకాలపై ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన నిధులను వెంటనే అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.అలాగే గిగ్, ఫ్లాట్ ఫామ్ వర్కర్స్ యాక్ట్ విషయంలో పూర్తి స్థాయి అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# భారత్ ఇప్పుడు ప్రపంచ కార్ఖానా : ప్రధాని మోడీ

బలగం టీవీ, హైదరాబాద్



భారతీయ ఉత్పత్తులు విదేశాలకు వెళుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా తమ ఉనికిని చాటుకుంటున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తన 'స్థానికంకోసం ఎలుగెత్తి చాటాలి' ప్రచారోద్యమం సత్ఫలితాలు సాధిస్తోందని ఆయన చెప్పారు. ఢిల్లీలో ఎన్‌ఎక్స్‌టి కాన్‌క్లేవ్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ, భారత్ అపరిమిత సృజనల భూమిగా మారుతోందని, అందుబాటులో పరిష్కారాలు కనుగొంటున్నదని, ప్రపంచానికి వాటిని సూచిస్తోందని తెలిపారు. ఈ కాన్‌క్లేవ్‌లోనే 'న్యూస్‌ఎక్స్ వరల్డ్' చానెల్‌ను ఆవిష్కరించడమైంది.'ప్రపంచం 21వశతాబ్దపు భారత్‌ను ఆసక్తితో పరికిస్తున్నది. ప్రపంచం అంతటి నుంచి ప్రజలు భారత్‌ను సందర్శించి అవగాహన చేసుకోవాలని వాంఛిస్తున్నారు' అని మోడీ తెలియజేశారు. దేశం ఇప్పుడు తయారీ కేంద్రంగా, 'ప్రపంచ కారా?నా'గా ఆవిర్భవిస్తోందని ప్రధాని వెల్లడించారు. 'దశాబ్దాలుగా భారత్‌ను తమ పెరటి విభాగంగా ప్రపంచం పరిగణిస్తుండేది. ఇప్పుడు భారత్ ప్రపంచానికి కొత్త కర్మాగారంగా మారుతోంది. మేము ఇక ఎంత మాత్రం శ్రామికశక్తి కాము, కానీ దానికి బదులు ప్రపంచ శక్తిగా మారుతున్నాం' అని మోడీ చెప్పారు.

భారత పెరుగుతున్న రక్షణ ఉత్పత్తులు తమ ఇంజనీరింగ్, సాంకేతిక బలాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నాయని ప్రధాని ఉద్ఘాటించారు. 'ఎలక్ట్రానిక్స్ నుంచి ఆటోమోబైల్ రంగం వరకు ప్రపంచం భారత స్థాయిని, సత్తాను తిలకించింది. భారత్ ప్రపంచానికి కేవలం ఉత్పత్తులను సమకూరుస్తుండడమే కాకుండా గ్లోబల్ సప్లయి చైన్‌లో విశ్వసనీయ, ఆధారపడదగిన భాగస్వామిగా మారుతోంది' అని మోడీ చెప్పారు. వివిధ రంగాల్లో భారత నాయకత్వం ఏళ్ల తరబడి కఠిన శ్రమ, వ్యూహాత్మక విధాన నిర్ణయాల ఫలితమని ప్రధాని పేర్కొన్నారు. దేశం సెమీకండక్టర్లను, విమానవాహక నౌకలను తయారు చేస్తున్నదని, 'మఖానా', చిరుధాన్యాలు వంటి సూపర్ ఆహారాలను, ఆయుష్ ఉత్పత్తులను, యోగాను ప్రపంచవ్యాప్తంగా స్వాగతిస్తున్నారని మోడీ తెలియజేశారు. భారత్ ప్రపంచానికి సున్నా సిద్ధాంతాన్ని అందజేసిన భూమి అని, అది ఇప్పుడు అపరిమిత సృజనల భూమిగా మారుతోందని ప్రధాని చెప్పారు. 'ప్రపంచానికి భద్రమైన, వ్యయనియంత్రిత డిజిటల్ చెల్లింపు వ్యవస్థ అవసరమైనప్పుడు భారత్ యుపిఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్)ను అభివృద్ధి చేసింది.

# మంచు చరియలు విరిగిపడిన నలుగురు మృతి

- 50 మందిని కాపాడిన రెస్క్యూ సిబ్బంది
- లభించని ఐదుగురి ఆచూకి

బలగం టీవీ, హైదరాబాద్



ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో నలుగురు బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కార్మికులు మృతి చెందారు. మరో ఐదుగురి ఆచూకీ తెలియాల్సి ఉంది. 50 మందిని రెస్క్యూ సిబ్బంది రక్షించారు. ఆచూకీ లభ్యం కాని వారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ విషయాన్ని రక్షణ శాఖ డెహ్రాడూన్ ఏరియా పబ్లిక్ రిలేషన్ అధికారి మీడియాకు వెల్లడించారు.

ఉత్తరాఖండ్‌లో గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న హిమపాతంవల్ల మంచు గుట్టల్లా పేరుకుపోయింది. ఈ క్రమంలో చమోలి జిల్లాలోని మన గ్రామ సమీపంలోని చమోలి–బద్రీనాథ్ రహదారిపై ఏర్పాటు చేసిన బీఆర్వో శిబిరంపై పెద్దఎత్తున మంచు చరియలు విరిగిపడ్డాయి. దాంతో అక్కడ పనిచేస్తున్న 59 మంది బీఆర్వో కార్మికులు మంచులో చిక్కుకుపోయారు. శు క్రవారం ఉదయం 7.15 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో బీఆర్వో కార్మికులు ఎనిమిది కంటెయినర్‌లు, ఒక షెడ్డులో ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు వారిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం 54 మందిని ప్రాణాలతో బయటికి తీశారు. వారికి మన గ్రామంలో ఏర్పాటు చేసిన ఐటీబీపీ శిబిరంలో చికిత్స అందిస్తున్నారు. వారిలో నలుగురు పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో ఇంకా ఆచూకీ దొరకని ఐదుగురు కార్మికుల గురించి ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదంలో మంచు చరియల కింద చిక్కుకున్న అందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

# కామారెడ్డిలో భార్యను చంపి కత్తితో పొడుచుకున్న భర్త

బలగం టీవీ, హైదరాబాద్

కామారెడ్డి జిల్లాలోలో దారుణం జరిగింది. నడిరోడ్డుపై భార్యను చంపి కత్తితో పొడుచుకున్నడు భర్త . జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా సులభ్ కాంప్లెక్స్ లో పనిచేస్తున్న నర్సింలు అనే వ్యక్తి డబ్బుల విషయంలో భార్య సంగీత (48)తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆగ్రహించిన భర్త నర్సింలు కత్తితో ఆమె గొంతుకోసి అతడు అదే కత్తితో కడుపులో పొడుచుకున్నాడు. తీవ్రంగా గాయపడ్డ సంగీత అక్కడికక్కడే మృతి చెందగా భర్త నర్సింలును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతనిఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

# పిల్లలను అన్ని షోలకు అనుమతి

- థియేటర్లలో స్పెషల్ షోలను మాత్రం అనుమతి లేదు
- హైకోర్టు

బలగం టీవీ, హైదరాబాద్



తెలంగాణలోని థియేటర్లలో16 ఏళ్లలోపు పిల్లలను అన్ని షోలకు అనుమతించాలని హైకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ మేరకు జనవరి 21న జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు సవరించింది. అయితే.. థియేటర్లలో స్పెషల్ షోలను మాత్రం అనుమతించేదిలేదని హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను మార్చి 17వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది.

సినిమా థియేటర్లలో షోలు ప్రదర్శించడంలో సినిమాటోగ్రఫీ చట్టాన్ని కచ్చితంగా పాటించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం అర్ధరాత్రి 1:30 గంటల నుంచి ఉదయం 8:40 వరకు థియేటర్లలో ఎలాంటి ప్రత్యేక షోలు నిర్వహించరాదని హైకోర్టు ఆదేశించింది. కాగా.. ఇటీవల పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సమయంలో సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో.. స్పెషల్ షోలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధాన్ని విధించిన విషయం తెలిసిందే.

# ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి..

బలగం టీవీ, హైదరాబాద్

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లా కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు సమాచారం అందడంతో కోబ్రా, డీఆర్జీ, జిల్లా బలగాల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో తారసపడ్డ మావోయిస్టులు భద్రతాబలగాలపై కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన సుమారు 500 మందితో కూడిన భద్రతా దళాలు నలుదిక్కుల నుంచి మావోయిస్టులను చుట్టుముట్టాయి. మావోయిస్టుల కాల్పులతో అప్రమత్తమైన భద్రతా బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఇరు వర్గాల మధ్య నాలుగు విడతలుగా కాల్పులు జరిగాయి. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలో పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకొని గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో ఎదురు కాల్పుల్లో మృతి చెందిన ఇద్దరు మావోయిస్టులతో పాటు వారికి సంబంధించిన మారణాయుధాలు, ఇతర వస్తు, సామాగ్రిని భద్రతా దళాలు స్వాధీనపరుచుకున్నాయి. మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు ఉన్నట్లు సమాచారం. భద్రత దళాలు ఆ ప్రాంతంలో మావోయిస్టుల కోసం ముమ్మరంగా గాలింపులు చేపడుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# రాజీనామాకు సిద్ధం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్



రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వడానికి సామాజిక సమీకరణాలు అడ్డొస్తే తాను రాజీనామా చేసి, ఎవరినైనా గెలిపించేందుకు సిద్ధమని జిల్లాకు చెందిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని, జిల్లా అభివృద్ధి కోసం అవసరమైతే తాను రాజీనామా చేయడానికి కూడా సిద్ధమేనని అన్నారు. జిల్లాలో మంత్రి ప్రాతినిధ్యం కోసం రాజీనామా చేయమంటే చేస్తానని వ్యాఖ్యానించారు. ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని వాపోయారు. పార్టీ కోసం కష్టపడిన వారిని పక్కన పెట్టడం సరికాదని ఆయన అన్నారు. పార్టీలోకి ఎవరైనా వస్తే గౌరవం ఇవ్వాలే కానీ, పదవులు కాదని అన్నారు. రాష్ట్రంలోనే అధిక జనాభా కలిగిన రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి రావాలని ఆయన అన్నారు.

# జేఎన్టీయూ-హెచ్ జాబ్ మేళాలో తోపులాట..

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్టీయూలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు పెద్ద ఎత్తున అభ్యర్థులు హాజరయ్యారు. ఉద్యోగార్థులు పోటెత్తడంతో తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని జాబ్ మేళా సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. ఈ ఉద్యోగ మేళాకు మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. జేఎన్టీయూ హైదరాబాద్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఈ ఉద్యోగ మేళాను ఏర్పాటు చేశామని జేఎన్టీయూ–హెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి తెలిపారు. సుమారు 90 కంపెనీలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొంటున్నాయని చెప్పారు.

# ఢిల్లీలో ఆ వాహనాలకు పెట్రోల్, డీజిల్ బంద్

బలగం టీవీ, హైదరాబాద్

దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం పెరుగుతోంది. దీంతో కాలుష్య నివారణకు ఢిల్లీ సర్కార్ తాజాగా సంచలన నిర్ణయం తీసుకుంది. 15 ఏళ్లు పైబడిన వాహనాలకు మార్చి 31 తర్వాత బంకుల్లో పెట్రోల్, డీజిల్ పోయవద్దని ఆదేశించింది. ఈ మేరకు రవాణశాఖ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 1 నుంచి అందరూ తప్పకుండా నిబంధనలు అమలు చేయాలని బంకుల యజమానులను ఆదేశించారు. వాయు కాలుష్యంతో ఢిల్లీ సతమతమవుతోందని, ఇకపై కఠిన నిర్ణయాలు తప్పవని మంత్రి చెప్పారు. అప్పుడే పరిస్థితుల్లో ఎంతోకొంత మార్పు రావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వాహనాలను గుర్తించేందుకు పెట్రోల్ బంకుల్లో ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే 2025 చివరి నాటికి పబ్లిక్ సీఎన్జీ బస్సుల్లో 90 శాతం బస్సులను తొలగిస్తామని ప్రకటించారు. వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టునున్నట్లు మంత్రి మంజీందర్ సింగ్ తెలిపారు.

# పోసాని కృష్ణమురళికి అస్వస్థత

బలగం టీవీ, హైదరాబాద్

ఏపీలోని అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న పోసాని కృష్ణమురళి స్వల్ప అస్వస్థత గురయ్యారు.. ఆయనను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు పోలీసులు. పోసాని కృష్ణ మురళికి అక్కడి వైద్యులు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ పరీక్షలలో ఆయన ఆరోగ్యంలో స్వల్ప తేడా ఉన్నట్లుగా గుర్తించారు వైద్యులు . మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించే అవకాశం కనిపిస్తోంది.కాగా, కులాలు, వర్గాలపై గత ఏడాది పోసాని కృష్ణ మురళి చేసిన వ్యాఖ్యల మీద ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా ఓబులవారిపల్లె పోలీసులు కేసు నమోదు చేసి తాజాగా ఆయనను అరెస్ట్ చేశారు. ఆయనను అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు కోర్టులో హాజరు పరిస్తే కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలోనే రాజంపేట సబ్ జైల్లో మార్చి 12వ తేదీ వరకు పోసాని కృష్ణమురళి రిమాండ్ ఖైదీగా ఉండాల్సి ఉంది.

# ఢీ షో డ్యాన్సర్ మోసం చేయడంతో యువతి ఆత్మహత్య..!

బలగం టీవీ, హైదరాబాద్

నా చావుకు కారణం అభి... అంటూ ఓ యువతి (24) సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర కలకలం రేపింది. ఖమ్మం రూరల్ ఏరియా పొన్నెకల్లులో ఈ ఘటన చోటుచేసుకుంది. బలవన్మరణానికి పాల్పడిన యువతిని కావ్య కల్యాణిగా గుర్తించారు. ఆమె తన సెల్ఫీ వీడియోలో ఆరోపణలు చేసిన వ్యక్తి అభి... ఢీ టెలివిజన్ షోలో ఓ డ్యాన్సర్ అని తెలుస్తోంది. తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి అభి మోసం చేశాడని, ఐదు సంవత్సరాల నుంచి తాను అభి వాళ్ల ఉంట్లోనే ఉంటున్నానని కావ్య వెల్లడించింది. కానీ, అతడు ఇప్పుడు తనను వదిలేసి మరో అమ్మాయిని తీసుకువచ్చి, ఆమెనే పెళ్లి చేసుకుంటానని చెబుతున్నాడని కావ్య కన్నీటి పర్యంతమైంది. తనను వెళ్లిపొమ్మని చెబుతున్నాడని, తన చావుకు కారణం అభి అంటూ ఆమె తన సెల్ఫీ వీడియోలో ఆరోపించింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ఆరంభించారు.

# తెలంగాణకు కేంద్రం పదేండ్లలో పది కోట్లు ఇచ్చింది

- కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డిపై అసంతృప్తి
- సిద్ధాంతానికి, విలువలకు కట్టుబడి ఉండే వ్యక్తిని నేను
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో, దానిని కప్పిపుచ్చుకునేందుకే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్రం గత పదేళ్లలో తెలంగాణకు పది లక్షల కోట్లు ఇచ్చిందని, రేవంత్ రెడ్డి మీద కోపంతో తెలంగాణ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటామని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత వారం రోజులుగా బీజేపీపైనా, వ్యక్తిగతంగా తనపైనా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణకు ప్రాజెక్టులు, నిధుల కేటాయింపును అడ్డుకుంటున్నానని తనపైన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతోందని, అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలు, హామీలు ఇచ్చి విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డిపై అసంతృప్తి వ్యక్తం అవుతోందని, తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి మాటలను పట్టించుకోవడం లేదని అన్నారు. తాను సిద్ధాంతానికి, విలువలకు కట్టుబడి ఉండే వ్యక్తినని, సీఎం వైఫల్యాలు, అసమర్థతను తనపైన రుద్దితే సహించబోనని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నపుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాలని సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డుకు ప్రధానిని తానే ఒప్పించానని, రీజినల్ రింగ్ రోడ్డు తొలి ఫేజ్‌కు త్వరలోనే నిధులు విడుదల అవుతాయని తెలిపారు. అలాగే దక్షిణాదిలో లోక్‌సభ సీట్లు తగ్గుతాయని గగ్గోలు పెడుతున్నారని, సీట్లు తగ్గిస్తామని కేంద్రం చెప్పిందా లేదా మోదీ, అమిత్ షా చెప్పారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ పాత మిత్రులని, కేసీఆర్ కాంగ్రెస్‌తో కలిసి పని చేశారని గుర్తు చేశారు. ఎస్ఎల్బీసీ దగ్గర పనులు జరుగుతుంటే వెళ్లి రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

## చిట్టి డబ్బులు కట్టలేక కరెంటు స్తంభానికి ఉరివేసుకొని ఆత్మహత్య



**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన పబ్బల్ల కొమురయ్య తండ్రి భూమయ్య (55) మూడు నెలల క్రితం తన కులం సంఘంలో 30 వేల రూపాయలు తీసుకొని,రెండు నెలలుగా అట్టి డబ్బులు కట్టడం లేదు. శనివారం రోజున కులం చిట్టి ఉన్నందున అట్టి డబ్బులు కట్టడానికి తన దగ్గర డబ్బులు లేనందున, అవి ఎలా కట్టాలో అని బాధపడుతూ శనివారం తన పొలం వద్ద ఉదయం ఆరు గంటలకు నైలాన్ తాడుతో కరెంటు స్తంభానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని కొడుకు పబ్బల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండల ఎస్.ఐ పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.




## అమరులకు ఘన నివాళి

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఏ.బి.సి.డి వర్గీకరణ కోసం అమరులైన వారిని స్మరించుకుంటూ మండల కేంద్రంలో శనివారం రోజున ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ డాక్టర్ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండల శాఖ ఎంఆర్పీఎస్ అధ్యక్షులు అక్కెనపల్లి ఉపేందర్ ఆధ్వర్యంలో వారికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రిజర్వేషన్ పోరాటంలో తమ ప్రాణాలను కూడా లెక్క చేయకుండా జాతీయ ఉద్యమాన్ని నడిపి, వారి చివరి ఊపిరి వరకు జాతి ఉద్యమం కోసం, పనిచేసే వారి ప్రాణాలను పణంగా పెట్టిన అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మాజీ ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్, ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఉపాధ్యక్షులు పులివెందుల రాజు, జంగం శ్రీధర్, కన్నం సాగర్, సీనియర్ నాయకులు సావనపల్లి రాజయ్య అల్వాల అంజయ్య, కొర్లపల్లి అంజయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 8న లక్ష మంది మహిళలతో సభ

- మహిళ దినోత్సవం రోజున కొత్త పాలసీ
- మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క




**బలగం టీవీ , హైదరాబాద్**

అంతర్జాతీయ మహిళ దినోత్సవం రోజున సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో సుమారు లక్ష మంది మహిళలతో సభ నిర్వహిస్తామని.. మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆ రోజున పలు కొత్త పథకాలకు శ్రీకారం చుడుతామని ఆమె అన్నారు. ప్రధానంగా ఇందర మహిళ శక్తి పాలసీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేస్తారని ఆమె పేర్కొన్నారు. పట్టణాల్లో మహిళా సంఘాలను బలోపేతానికి సిఎం కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని ఆమె అన్నారు. గడిచిన ఏడాది కాలంలో ప్రమాదవశాత్తు మరణించిన 400 మంది మహిళలకు రూ.40 కోట్ల బీమా చెక్కులను సిఎం అందిస్తారన్నారు. దాంతో పాటుగా 32 జిల్లాల్లో 64 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను సిఎం వర్చువల్‌గా ప్రారంభిస్తారని.. వడ్డీ లేని రుణాల చెక్కులను సిఎం పంపిణీ చేస్తారని తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళలే నిర్వహించే పెట్రోల్ బంకులు ఉన్నట్లు.. అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు మహిళ దినోత్సవం రోజు చమురు సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో పెరుగుతున్న హింస


**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు**



**బలగం టీవీ , హైదరాబాద్**


తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హింస, నేరాలు పెరిగిపోతున్నాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని నార్యనాయక్ తండాలో తాజాగా బీఆర్ఎస్ కేడర్‌పై జరిగిన దాడే దీనికి నిదర్శనమని ఆయన ఒక ప్రకటనలో చెప్పారు.కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ శ్రేణులను ఉసిగొల్పుతూ నిజంగానే మార్పు తెచ్చారు. కాంగ్రెస్ మార్క్ ఎమర్జెన్సీని ఆ పార్టీ కొల్లాపూర్‌లో అమలు చేయిస్తోంది. సాతాపూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై దాడి జరిగి ఒక రోజు గడవక ముందే నార్యానాయక్ తండాలో కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు గర్హనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుల దాడులు పెరిగిపోతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రవర్తిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రచారం చేసుకునే హక్కు ప్రతిపార్టీకి ఉంటుంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడం ప్రతిపక్షాల కర్తవ్యం. బీఆర్ఎస్ ఈ పనులు చేస్తుంటే కాంగ్రెస్‌కు జీర్ణం కావడం లేదు. తమ వైఫల్యాలు ప్రజలకు తెలిస్తాయని భయపడుతూ దాడులుకు పాల్పడుతున్నది. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. ఇలాంటి ఎన్నో అణచివేతలను ఎదుర్కొని నిలిచింది. దాడులకు, కేసులకు మా కార్యకర్తలు భయపడరు. బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది. పోలీసులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుని తమ కర్తవ్యం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాను అని హరీశ్‌రావు తెలిపారు.

## ఎండలు మండుతాయి



**బలగం టీవీ , హైదరాబాద్**

రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎండలు మండిపోతాయి అంటూ.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రంగా ఉంటాయని, ఇక ఏప్రిల్, మేలలో 44 నుంచి 46 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చుని అంచనా వేసింది. 1901 నుంచి 2025 వరకు సరాసరి సగటు తీసుకుంటే.. ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దక్షిణ, మధ్య తెలంగాణలతో పాటు.. హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో భానుడి భగభగలు తీవ్రంగా నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయి. దక్షిణ, ఉత్తర తెలంగాణలో రాత్రిపూట ఉష్ణోగ్రతలు సైతం సాధారణం కంటే రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.



## కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ

**బలగం టీవీ , హైదరాబాద్**

వరంగల్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వరంగల్ జిల్లాలో మామునూరు విమానాశ్రయం వద్ద ఇరు వర్గాల నేతల మధ్య తోపులాట జరిగింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు రెండు వర్గాల నేతలు అడ్డుకున్నారు. మామునూర్ ఎయిర్‌పోర్టు విషయమై వరంగల్‌లో ఉద్రిక్తత నెలకొంది. మామునూర్ విమానాశ్రయానికి ఇటీవల కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విమానాశ్రయానికి కేంద్రం అనుమతి ఇవ్వడంతో ప్రధాని మోదీకి పూలాభిషేకం చేసేందుకు బీజేపీ శ్రేణులు శనివారం ఉదయం అక్కడికి చేరుకున్నాయి. విమానాశ్రయం వద్ద మోదీకి పూలాభిషేకం చేసేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నించారు. కాగా, బీజేపీ నేతలు అక్కడికి వచ్చిన సమయంలోనే కాంగ్రెస్ శ్రేణులు సైతం విమానాశ్రయం వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే విమానాశ్రయం రెడీ అవుతోందని వ్యాఖ్యలు చేశారు. దీంతో, ఇరు వర్గాలు మధ్య ఘర్షణ తలెత్తింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను అడ్డుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఇరు వర్గాల నేతలు ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించడం గమనార్హం.

## విషమంగా పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్య పరిస్థితి

**బలగం టీవీ , హైదరాబాద్**



: పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్య పరిస్థితి చాలా విషమంగా ఉందని వాటికన్ తెలిపింది. పోప్‌ను యాంత్రిక వెంటిలేషన్‌లో చేర్చినట్లు వాటికన్ తెలిపింది. శ్వాసకోశ పరిస్థితి అకస్మాత్తుగా క్షీణించడంతో, ఆయనను యాంత్రిక వెంటిలేషన్‌లో చేర్చినట్లు వాటికన్ తెలిపింది. ప్రస్తుతం ఆయన కృత్రిమ శ్వాసలో ఉన్నారని వాటికన్ తెలిపింది. కానీ పోప్ ఆరోగ్య పరిస్థితి గురించి వాటికన్ మరిన్ని వివరాలను విడుదల చేయలేదు. పోప్ ఆరోగ్యం ఇతర రోజు మెరుగుపడిందని, ఆయన మంచం మీద నుండి లేచి కుర్చీలో కూర్చున్నారని నివేదించబడింది. ఫిబ్రవరి 14న ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా పోప్ రోమ్‌లోని ఒక ఆసుపత్రిలో చేరారు. అప్పుడు పోప్ మూత్రపిండాల పనితీరు దెబ్బతింది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ మరియు చికిత్స కారణంగా కిడ్నీ ప్రభావితమైంది.

## అసెంబ్లీలో విపక్ష నేత హెూదా మాకు ఇవ్వాలి: సంజయ్ రౌత్

**బలగం టీవీ , ముంబై**

మహారాష్ట్ర శాసనసభలోతమ పార్టీకి విపక్ష నేత హెూదా ఇవ్వాలని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ డిమాండ్ చేసారు. మహారాష్ట్ర బడ్జెట్ సమావేశాలు మార్చి 3 నుంచి 26 వరకూ జరగనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో 10 శాతం సీట్లు లేకున్నా కూడా గతంలో విపక్ష పార్టీలకు అసెంబ్లీలో ప్రతిపక్ష హెూదా లభించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. 288 మంది సభ్యుల అసెంబ్లీలో విపక్షాల బలం సుమారు 50 వరకూ ఉన్నట్టు ఆయన తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హెూదా ఇవ్వాలన్న తమ విజ్ఞప్తికి స్పీకర్ ఆమోదం తెలుపుతారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

# ఇంగ్లండ్‌ది అదే కథ








## మార్పులతో బరిలోకి..!

**బలగం టీవీ, హైదరాబాద్**

దుబాయ్‌లో జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లు చివరి దశకు చేరుకున్నాయి. గ్రూప్ స్టేజీలో చివరి మ్యాచ్ భారత్, న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరగనుంది. భారత జట్టు బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లను ఓడించి సెమీఫైనల్‌లోకి ప్రవేశించింది. న్యూజిలాండ్ కూడా పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లను ఓడించి సెమీఫైనల్‌కు వచ్చింది. అయితే ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలుస్తుంది కాబట్టి ఇది చాలా ముఖ్యమైన మ్యాచ్ గా మారింది

ఇక పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కాలు నొప్పి కారణంగా బాధపడిన మహ్మద్ షమీ న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో అతను ఆడటం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో షమీ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చే అవకాశముంది. అలాగే గత రెండు మ్యాచ్‌ల్లో అవకాశం రాని ఆటగాళ్లకు న్యూజిలాండ్ మ్యాచ్‌లో అవకాశం ఇస్తారని సమాచారం. ఇదే జరిగితే కేఎల్ రాహుల్ స్థానంలో రిషబ్ పంత్ జట్టులోకి వస్తాడు. అలాగే, కుల్దీప్ యాదవ్ స్థానంలో వరుణ్ చక్రవర్తి కూడా ఆడనున్నాడు. అదేవిధంగా అక్షర్ పటేల్ స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను ఆడించే అవకాశం ఉంది.

## ఇంగ్లండ్‌పై సౌతాఫ్రికా ఘన విజయం
## ఛాంపియన్స్ ట్రోఫీలో సెమీస్‌కు దక్షిణాఫ్రికా




**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఇంగ్లండ్ అదే కథ రిపీట్ చేసింది. ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడి సెమీస్ చేరకుండానే ఇంటిదారి పట్టిన ఇంగ్లీష్ టీమ్.. తాజాగా సౌతాఫ్రికాతో శనివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లోనూ 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. మరోవైపు సౌతాఫ్రికా ఐదు పాయింట్లతో గ్రూప్-బీ టాపర్‌గా సగర్వంగా సెమీస్ చేరింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 38.2 ఓవర్లలో 179 పరుగులకే ఆలౌటైంది. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్(3/39), వియాన్ మల్డర్(3/25)లు మూడేసి వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా.. కేశవ్ మహరాజ్(2/35) రెండు వికెట్లు పడగొట్టాడు. లుంగి ఎంగిడి, కగిసో రబాడా తలో వికెట్ తీసారు.

అనంతరం సౌతాఫ్రికా 29.1 ఓవర్లలో 3 వికెట్లకు 181 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్(27), ట్రిస్టన్ స్టబ్స్(0) విఫలమైనా.. రాసీ వాన్ డెర్ డస్సెన్(87 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 72 నాటౌట్), హెన్రీచ్ క్లాసెన్(56 బంతుల్లో 11 ఫోర్లతో 64) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ ఒక్కడే 2 వికెట్లు తీసాడు. ఇక నేడు జరిగే ఇండియా న్యూజిలాండ్ మ్యాచ్ ఫలితంలో సెమీస్‌లో ఎవరు ఎవరితో తలపడతారో తెలనుంది.

## సెమీస్‌కు ముందు ఆసీస్‌కు షాక్


**బలగం టీవీ, హైదరాబాద్**

షార్ట్ గాయపడడంతో ఆస్ట్రేలియాకు సెమీస్‌లో కష్టాలు ఎదురయ్యే ఛాన్సు ఉంది. సెమీస్‌లో షార్ట్ ఆడేది అనుమానమే అని కెప్టెన్ స్మిత్ పేర్కొన్నాడు. అతను ఇబ్బందిపడుతున్నాడని, సరిగా కదలేకపోతున్నాడని, అతను త్వరగా రికవరీ కావడం కష్టమే అన్నాడు. అయితే షార్ట్ స్థానంలో మరో భారీ హిట్టర్ జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌కు అవకాశం ఇచ్చే ఆలోచనలో ఆస్ట్రేలియా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల లంకతో జరిగిన వన్డే సిరీస్‌లో అతను విఫలం అయ్యాడు. ఆల్‌రౌండర్ ఆరన్ హార్డీ ని కూడా తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. సెమీస్‌లో ఇండియా లేదా న్యూజిలాండ్‌తో ఆస్ట్రేలియా ఆడే ఛాన్సు ఉన్నది.

## ముందు ఇంగ్లండ్ జట్టు లోపాలపై దృష్టి పెట్టండి

● **సునీల్ గవాస్కర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగానే జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే ఒకే వేదికగా భారత మ్యాచ్‌లు జరగడం ద్వారా ఆ జట్టుకు అధిక ప్రయోజనం కలుగుతుందని ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు నాజర్ హుస్సేన్, మైక్ అథర్టన్‌తో పాటు ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అన్నారు. ఇది అన్యాయమని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై సునీల్ గవాస్కర్ ఘాటుగా బదులిచ్చాడు.

'ఇంగ్లండ్ రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోవడంతో సెమీఫైనల్ చేరలేకపోయింది. ఆ బాధను వేరే జట్లపై వెళ్లగక్కడం సరికాదు. ముందుగా ఇంగ్లండ్ జట్టు లోపాలపై దృష్టిసారించండి. ఈ విషయాలను నాజర్ హుస్సేన్, మైక్ అథర్టన్ అర్థం చేసుకుంటారని భావిస్తున్నా. ఇంగ్లండ్ సెమీస్ చేరకపోవడానికి గల కారణాలపై సమాలోచనలు చేయండి. అంతేకానీ టీమిండియా గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు. ఇంగ్లండ్ ఆటగాళ్లు ఈ ఫలితాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. జట్టును గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలను సూచించండి. దేశం కోసం ఆడేటప్పుడు బాధ్యత కూడా చాలా ఎక్కువగా ఉంటుందని గ్రహించాలి. అంతేకానీ, 'భారత్‌కు అలాంటి అవకాశం వచ్చింది. మాకు మాత్రం రాలేదు' అని విచారం వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. ఇలాంటి పొగరు మాటలు మాట్లాడవద్దని గతంలో చెప్పాను. కానీ మళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌కు టీమిండియా అందించే సేవలు అద్భుతం. ప్రతిభ పరంగానే కాకుండా ఆర్థికంగానూ వెన్నుదన్నుగా నిలుస్తోంది. టీవీ, మీడియా హక్కుల ద్వారా భారీగా ఆదాయం వస్తోంది. ఇంగ్లండ్ కామెంటేటర్లకు జీతాలు పరోక్షంగా టీమిండియా వల్లనే వస్తున్నాయి. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు.




## 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తెలుగు టీజర్

**బలగం టీవీ, హైదరాబాద్**

అజిత్ హీరోగా నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ తెరకెక్కిస్తున్న సినిమా ఇది. త్రిష హీరోయిన్. శనివారం తెలుగు టీజర్ ను చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేసింది. అజిత్ ఫ్యాన్స్ ఆశించే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నట్టు టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఏప్రిల్ 10న సినిమా విడుదల కానుంది.



## 'కన్నప్ప' కొత్త టీజర్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**


మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. ఈ సినిమాలో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తుండగా.. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తున్నాడు. ఏప్రిల్ 25న విడుదల కాబోతోంది. ఈ చిత్రం నుంచి తాజాగా మరో టీజర్ విడుదలైంది. ఇక టీజర్ చివరిలో రుద్రుడిగా ప్రభాస్ లుక్స్ గూజ్ బంప్స్ తెప్పించాయి. హిస్టారికల్ కం మైథాలజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ టీజర్ లో శివుడిగా అక్షయ్ కుమార్ పాత్రను, అలాగే పార్వతి దేవిగా కాజల్ అగర్వాల్ పాత్రతో పాటు మోహన్ బాబు, మోహన్ లాల్ సహా పలువురి పాత్రలను చూపించారు.



## ఓటీటీలోకి 'బాపు'..

**బలగం టీవీ, హైదరాబాద్**

సీనియర్ నటులు బ్రహ్మాజీ, ఆమని, బలగం సుధాకర్ రెడ్డి ప్రధాన పాత్రల్లో వచ్చిన తాజా చిత్రం బాపు. ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ.. అనేది ఉపశీర్షిక. ఈ సినిమాకు దయా దర్శకత్వం వహించగా.. అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 21న విడుదలైంది. అయితే ప్రముఖ ఓటీటీ వేదిక జియోహాట్‌స్టార్‌లో ఈ చిత్రం మార్చి 7 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.




## అన్నయ్య లైవ్ కాన్సర్ట్ కోసం ఎదురుచూస్తున్నా

● **దర్శకుడు రాజమౌళి**

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆస్కార్ అవార్డు విన్నర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి లైవ్ కాన్సర్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. 'నా టూర్ ఎమ్ఎమ్‌కే' పేరిట ఈ కాన్సర్ట్ చేయనున్నారు. మార్చి 22న సాయంత్రం 7 గంటలకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ ఈవెంట్ ప్రారంభం కానుంది. అయితే, ఈ లైవ్ కాన్సర్ట్ ను విజయవంతం చేయాలని కోరుతూ ఆయన సోదరుడు, ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక వీడియో సందేశం ఇచ్చారు. తాను మార్చి 22 కోసం చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నట్లు జక్కన్న పేర్కొన్నారు. "ఎందుకంటే ఆరోజు అన్నయ్య ఎమ్ఎమ్ కీరవాణి కాన్సర్ట్ ఉంది. ఈ కాన్సర్ట్ లో నా సినిమాలోని పాటలతో పాటు ఆయన సంగీతం అందించిన ఇతర చిత్రాల్లోని పాటలను లైవ్‌లో ఆలపించనున్నారు. ఇక అన్నయ్య కీరవాణికి నా డిమాండ్ ఏంటి అంటే ఈ లైవ్ కాన్సర్ట్‌లో పాటలతో పాటు ఆయన ఓఎస్‌టీ (ఒరిజినల్ సౌండ్ ట్రాక్)లూ ఉండాలి. ఎందుకంటే ఆయన రీ రికార్డింగ్ చాలా అద్భుతంగా ఉంటుంది. ఆయన పాటలు ఎంత ఫేమసో అలాగే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ లు కూడా అంతే ఫేమస్. ఆ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌లను, ఓఎస్‌టీలను లైవ్ లో ప్లే చేయాలని కోరుకుంటున్నా" అంటూ తన వీడియో సందేశంలో రాజమౌళి పేర్కొన్నారు.